గోదావరి ఉగ్రరూపం

- డేంజర్ లెవల్ సమీపంలోకి వరద ప్రవాహం
- అన్నారం బరాజ్‌లో 5,63,076 క్యూసెక్కులు, మేడిగడ్డలో 8,35,795 క్యూసెక్కుల వరద
- మత్తడికి చేరువలో గణప సముద్రం

కాళేశ్వరం : పుష్కరఘాట్ వద్ద డేంజర్ లెవల్‌కు సమీపిస్తున్న గోదావరి వరద

జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 3 (నమస్తే తెలంగాణ) : ఎగువన కురుస్తున్న వర్షాలకు కాళేశ్వరం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది. నది డేంజర్ లెవల్ 104.75 మీటర్లు కాగా, ప్రస్తుతం వరద ప్రవాహం 103.50 మీటర్లకు చేరింది. ప్రమాద స్థాయి దాటితే సమీపంలోని పూస్కుపల్లికి రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది. అన్నారం (సరస్వతి)బరాజ్ నుంచి 5,63,076 క్యూసెక్కుల వరద వస్తుండగా అధికారులు 66 గేట్ల ద్వారా నీటిని బయటికి పంపిస్తున్నారు. అలాగే మేడిగడ్డ (లక్ష్మి) బరాజ్‌కు 8,35,795 క్యూసెక్కులు వస్తుండగా 85 గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. వరద ఇలానే కొనసాగితే పెద్దంపేట, కుదురుపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉం ది. చంద్రుపల్లి లో లెవల్ కల్వర్టుపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోగా మరో దారి వెంట ప్రజలు తిరిగి వెళ్తున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ సోమవారం గోదావరి పరీవాహక ప్రాంతాల్లో పర్యటించి లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. గణపసముద్రం నీటి సామర్థ్యం 30 అడుగులు కాగా ఇప్పటికే 27 అడుగులు దాటింది. మత్తడిపడితే మోరంచ ప్రవాహ ఉధృతి పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం మోరంచ ప్రవాహం వార్నింగ్ లెవల్ దాటింది. భూపాలపల్లి మండలంలోని భీంఘణపూర్ చెరువు నుంచి అధికారులు దేవాదుల ద్వారా నీటిని లిఫ్టు చేయడంతో చెరువు మత్తడికి దూరమైంది. ప్రస్తుతం నాలుగు రోజులుగా పంపింగ్ నిలిపివేయడంతో క్రమ క్రమంగా చెరువులో నీటి మట్టం పెరుగుతున్నది. జిల్లాలో ఊహించినంతగా వర్షాలు లేకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకుంటున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వరద వచ్చి చేరుతున్నది.

పుష్కరఘాట్‌ను సందర్శించిన ఓఎస్డీ

కాళేశ్వరం : పుష్కరఘాట్ వద్ద గోదావరిని మంగళవారం అడిషనల్ ఎస్పీ (ఓఎస్డీ) బోనాల కిషన్ సందర్శించారు. రెండు నదులు ఉధృతంగా పారుతుండడంతో భక్తులను గోదావరిలోకి దిగకుండా పోలీసులు చర్యలు చేపట్టాలన్నారు. తీరం వద్ద ఉన్న దుకాణాదారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, మహదేవపూర్ సీఐ రాంచందర్‌రెడ్డి, ఎస్సై చక్రపాణి ఉన్నారు. అలాగే అన్నారం బరాజ్‌ను చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ మంచిర్యాల జిల్లా రైతులతో కలిసి బ్యాక్ వాటర్‌తో ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడే ఇంజినీర్లతో మాట్లాడి నీరు పోయిన తర్వాత సర్వే రిపోర్టు ఇవ్వాలని ఆయన సూచించారు.

చిరుత ఆచూకీపై అధికారుల ఫోకస్

- 40మంది అటవీ సిబ్బందితో వాచింగ్
- మదనపల్లిలో సంచారంపై అప్రమత్తం

పొలాల్లో చిరుత పాద ముద్రలను పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

ములుగురూరల్, సెప్టెంబర్ 3 : ములుగు మండలంలోని మదనపల్లి గ్రామ శివారులో చిరుతపులి పాద ముద్రలను సోమవారం ఫారెస్టు అధికారులు గుర్తించిన విషయం తెలిసిందే. మంగళవారం ఎఫ్‌ఆర్వో శంకర్ నేతృత్వంలో జగ్గన్నపేట, పులిగుండం, పొట్లాపూర్, మదనపల్లి, ప్రేమ్‌నగర్, జాకారం, మల్లంపల్లి, మాన్‌సింగ్‌తండా, రామచంద్రాపురం, బండారుపల్లి, దేవనగర్, కొడిశలకుంట, పత్తిపల్లి, దేవగిరిపట్నం, కాసిందేవిపేట, కొత్తూరు తదితర గ్రామాల్లో మొత్తం 30మంది బీట్ ఆఫీసర్లను, 40మంది స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బందిని నియమించి చిరుతపులి కదలికపై ఫోకస్ చేస్తున్నారు. ములుగు మండలంలో అడవిని ఆనుకొని ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. గ్రామాల్లోకి చిరుత పులి ప్రవేశించినా, పరిసర ప్రాంతాల్లో కనిపించినా తమకు సమాచారం అందించాలని సూచనలు చేస్తున్నారు. దీంతోపాటు అటవీ ప్రాంతాల్లో చిరుతను కనుగొనేందుకు ట్రాప్ కెమెరాలను అమర్చారు. ములుగు జిల్లా అడవుల ఖిల్లా అని, గతం నుంచే ఈ ప్రాంతంలో అనేక జంతువుల సంచారం ఉందన్నారు. ఇందులో భాగంగానే మదనపల్లి గ్రామ శివారులో చిరుత పాద ముద్రల గుర్తింపు వెలుగులోకి వచ్చిందని అటవీశాఖలోని ఉన్నత స్థాయి అధికారులు వెల్లడించారు. చిరుత పులులు రాత్రి వేళల్లో స్పష్టంగా చూడగలవని, అవి లైట్ల ఫోకస్‌ను చూడలేవని వారు తెలిపారు. ఇంటి పరిసరాల్లో లైట్లు ఉంటే రాత్రి వేళల్లో ఇండ్లలోకి చిరుత రాదని, లైట్లను చూసిన వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోతుందని తెలిపారు. మేకలు, గొర్రెలు, ఇతర పశువులపై దాడి చేసినట్లయితే ఫారెస్టుశాఖ నుంచి నష్టపరిహారం సైతం అందుతుందన్నారు. ఆ సమయంలో చిరుతపై దాడి చేయకుండా ఫారెస్టు అధికారులకు సమాచారం అందించాలన్నారు. దీంతో దాన్ని పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఓఎస్డీ కిషన్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

పలిమెల, సెప్టెంబర్ 3 : భారీ వర్షాలు, వరదలతో లోతట్టు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఓఎస్డీ బోనాల కిషన్ సూచించారు. మంగళవారం మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. మావోయిస్టుల కదలికలపై టీజీఎస్పీ బలగాలను ఆరా తీశారు. అనంతరం సర్వాయిపేట, దమ్మూరు గోదావరి వరద ప్రాంతాల్లో పర్యటించారు. ఎగువన ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లోని వాగులు, వంకల్లోకి వరద నీరు చేరే అవకాశం ఉందన్నారు. మహదేవపూర్ సీఐ రామచందర్‌రావు, ఎస్సై తమాషారెడ్డి పాల్గొన్నారు.

భూపాలపల్లి జిల్లాలో 3.9 మి.మీ వర్షపాతం

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 3: జిల్లాలో మంగళవారం ఉదయం 8:30 గంటల వరకు 3.9 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మహదేవ్‌పూర్ మండలంలో 3.2 మిల్లీ మీటర్లు, మహాముత్తారం 3.4, పలిమెల 4.2, కాటారం 1.8, మల్హర్‌రావు 5.8, టేకుమట్ల 5, మొగుళ్లపల్లి 6, చిట్యాల 5.2, రేగొండ 3.2, గణపురం 2, భూపాలపల్లి మండలంలో 3.8 మిల్లీ మీటర్లు నమోదైనట్లు పేర్కొన్నారు.

రామప్ప దేవాలయం సందర్శన ప్రారంభం

31అడుగులకు చేరిన సరస్సు నీటిమట్టం

వెంకటాపూర్, సెప్టెంబర్ 3 : రామప్ప దేవాలయం సందర్శనకు పర్యాటకులను మంగళవారం అనుమతించారు. జిల్లాలో భారీ వర్షాల కారణంగా కలెక్టర్ ఆదేశాల మేరకు గత రెండు రోజులు సందర్శన నిలిపివేశారు. మంగళవారం అనుమతించడంతో పర్యాటకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రామప్ప చెరువు నీటి మట్టం 31అడుగులకు చేరుకుంది. మరో మూడు అడుగుల నీరు వస్తే రామప్ప చెరువు మత్తడి పడనుంది.

మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువగా..

పేరూరు వద్ద 15.280, రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద 14.410 మీటర్లకు చేరిన నీటిమట్టం

ఏటూరునాగారం/వాజేడు, సెప్టెంబర్ 3 : గోదావరి నది ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్నది. మంగళవారం సాయంత్రం 5గంటలకు రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి 14.410 మీటర్లతో ప్రవహిస్తుంది. 14.850 మీటర్లకు చేరుకుంటే మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేస్తారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో ఉన్న పంట పొలాలు మునిగాయి. దొడ్ల, ఎలిశెట్టిపల్లి జంపన్నవాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రవాణా సౌకర్యం నిమిత్తం పడవలు ఏర్పాటు చేశారు. కొండాయి సమీపంలోని ఎస్సీకాలనీ పరిసరాల్లోకి వరద చేరి మళ్లీ తగ్గినట్లు గ్రామస్తులు తెలిపారు. వాజేడు మండలంలోని పేరూరు వద్ద మంగళవారం సాయంత్రం ఆరు గంటలకు 15.280మీటర్లు(48)అడుగులకు నీటిమట్టం చేరుకున్నట్లు అధికారులు తెలిపారు.

టేకులగూడెం గ్రామశివారులో వరదనీరు చేరి జాతీయ రహదారి నీటమునిగింది. దీంతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ర్టాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చంద్రుపట్ల, పేరూరు వెళ్లే మద్రిమడుగువాగు బ్రిడ్జి పైనుంచి వరద ప్రవహిస్తున్నది. కొంగాల వాగు వద్ద రహదారిపైకి నీరు చేరి వాజేడు, గుమ్మడిదొడ్డి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా ప్రాంతాలను తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్ రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు.

వాజేడు : పూసూరు బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

మట్టి గణపతి విగ్రహాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

మట్టి గణపతులను పూజించాలి

పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్లు రాహుల్ శర్మ, టీఎస్ దివాకర

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ టీఎస్ దివాకర

భూపాలపల్లి రూరల్/ములుగు రూరల్, సెప్టెంబర్ 3 : పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలని కలెక్టర్లు రాహుల్‌శర్మ, టీఎస్ దివాకర అన్నారు. మంగళవారం భూపాలపల్లి, ములుగు కలెక్టరేట్లలో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాల పోస్టర్లను వారు ఆవిష్కరించి మాట్లాడారు. కాలుష్య నియంత్రణ మండలి ద్వారా ప్రతి జిల్లాకు 2వేల మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. వాటిని జిల్లా ప్రజలకు అందజేయనున్నట్లు వారు తెలిపారు. భూపాలపల్లిలో జడ్పీ సీఈవో విజయలక్ష్మి, కాలుష్య నియంత్రణ మండలి ఏఈ సుభాష్, పరిశ్రమల శాఖ జీఎం సిద్ధార్థరెడ్డి, డీఈవో రాజేందర్, బీసీ, ఎస్సీ సంక్షేమ అధికారులు శైలజ, సునీత, ఉద్యానవన శాఖాధికారి సంజీవరావు, ములుగులో అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, కాలుష్య నియంత్రణ మండలి అధికారి సుభాష్‌నాయక్, డీపీఆర్వో రఫిక్, ఏవో రాజ్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి ఇద్దరు విద్యార్థుల ఎంపిక

ములుగురూరల్, సెప్టెంబర్ 3 : జాకారం సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకులానికి చెందిన ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి సబ్ జూనియర్ టెన్నికాయిట్ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు గురుకుల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 10వ తరగతికి చెందిన డీ రామన్న గోల్డ్‌మెడల్ సాధించాడని, 9వ తరగతికి చెందిన డీ సాత్విక తృతీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. పాఠశాలలో విద్యార్థులను మంగళవారం శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పీడీ వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు సురేష్‌బాబు, రాంరెడ్డి, పిచ్చిరెడ్డి, కే సదయ్య. రామచంద్రం, దయానంద్ పాల్గొన్నారు.

రాళ్ల దాడిని ఖండించిన నాగజ్యోతి

ములుగు, సెప్టెంబర్ 3(నమస్తే తెలంగాణ) : ఖమ్మం జిల్లాలో మాజీ మంత్రులపై జరిగిన రాళ్ల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్, ములుగు నియోజకవర్గ బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి అన్నారు. ఆమె మాట్లాడుతూ వరద బాధితులను పరామర్శించేందుకు మంగళవారం ఖమ్మంలో పర్యటించిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డిల వాహనాలపై రాళ్లతో దాడి చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని అన్నారు. ముంపు ప్రాంత బాధితులను పట్టించుకోని కాంగ్రెస్ నాయకులు సహాయం చేసేందుకు వచ్చిన బీఆర్‌ఎస్ నేతలపై దాడి చేయడం హేయనీయమైన చర్య అన్నారు. జాతీయ పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ సహాయక చర్యల్లో పూర్తిగా విఫలమై ప్రతిపక్ష నాయకులపై దాడులు చేయడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు పద్ధతులు మార్చుకొని పరిపాలనపై దృష్టి సారించాలని నాగజ్యోతి హితవు పలికారు.

పాఠశాలకు డ్యుయల్ డెస్కులు బహూకరణ

ఏటూరునాగారం, సెప్టెంబర్ 3 : స్థానిక నార్త్ మండల పరిషత్ పాఠశాలకు వాషింగ్టన్ తెలంగాణ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.1.40లక్షల విలువ చేసే 20డ్యుయల్ డెస్కులను బహూకరించారు. స్థానిక ఏఎస్పీ శివం ఉపాధ్యాయ కార్యక్రమానికి హాజరై డ్యుయల్ డెస్కులను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు వన్నాల నాగార్జున రెడ్డి, రాజేష్, అలినేని గిరీశ్‌రావు, గొల్యాల నితీష్‌కుమార్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సాంబశివరావు, పాఠశాల హెచ్‌ఎం రాజశేఖర్, ఉపాధ్యాయులు రమాదేవి, రాంబాబు, సారంగపాణి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రాజేశ్, గ్రామస్తులు చెన్న కేశవులు, విశ్వనాథ్, తిరుపతమ్మ, పెండ్యాల ప్రభాకర్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

ములుగురూరల్/ఏటూరునాగారం, సెప్టెంబర్ 3 : ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్రం(ఫిజిక్స్)లో, ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలు అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పుల మల్లేశం, రేణుక మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. పీజీలో జనరల్, ఓబీసీ కేటగిరికి చెందిన వారు 55శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు 50శాతం మార్కులు సాధించనవారు అర్హులుగా తెలిపారు. ఈనెల 5వ తేదీ వరకు దరఖాస్తులు అందజేయాలన్నారు. ఏటూరునాగారంలో వివరాలకు 7093 084 347, 9490119483 నంబర్లను సంప్రదించాలన్నారు.

జాతీయ రహదారికి మరమ్మతులు

తాడ్వాయి, సెప్టెంబర్ 3 : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మండల కేంద్రం సమీపంలోని 163వ జాతీయ రహదారి దెబ్బతినడంతో గత మూడు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. స్పందించిన ఎన్‌హెచ్, ఆర్‌అండ్‌బీ అధికారులు మంగళవారం మరమ్మతులు ప్రారంభించారు. మొండ్యాలతోగు, జనగలంచ కొండపర్తి స్టేజీల వద్ద డీఈ కుమారస్వామి ఆధ్వర్యంలో పనులను చేపట్టారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి రాకపోకలను పునరుద్ధరిస్తామని డీఈ తెలిపారు.

మిరప నారు ధ్వంసం



చనిపోతున్న మిర్చి నారు వద్ద రైతు సంపత్

ఏటూరునాగారం, సెప్టెంబర్ 3 : మండల కేంద్రంలోని మూడో వార్డుకు చెందిన మిర్చి రైతు సరికొప్పుల సంపత్ మిర్చి నారుపై గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి మందు పిచికారి చేయడంతో మొక్కలు చనిపోతున్నాయి. ఇంటికి సమీపంలో మిర్చి నారు మడి వేసుకున్నాడు. అయితే సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నారుమడిపై గడ్డి మందు పిచికారి చేయడం వల్ల ఒక ఎకరానికి సరిపోయే మిర్చి నారు ధ్వంసమైందని, సుమారు దీని విలువ రూ.25వేల వరకు ఉంటుందని తెలిపారు. మార్కెట్‌లో ఒక మొక్కకు రూ.2 చొప్పున విక్రయిస్తున్నారని, నష్టంతో పాటు కష్టం కూడా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

ధన్వాడలో మరమ్మతులను పరిశీలిస్తున్న సీఈ భీకంసింగ్

కాటారం, సెప్టెంబర్ 3: విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని టీజీ ఎన్పీడీసీఎల్ సీఈ, ఇన్‌చార్జి సీజీఎం భీకంసింగ్ అన్నారు. మంగళవారం ఎస్‌ఈ మల్సూర్‌నాయక్, డీఈ నాగరాజుతో కలిసి ధన్వాడ 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వోఎల్‌టీసీ (ఆన్ లోడ్ ట్యాప్ చేంజర్) మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ భారీ వర్షాలతో జిల్లా పరిధిలో దెబ్బతిన్న 130 స్తంభాలు, ఐదు ట్రాన్స్‌ఫార్మర్లను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించామన్నారు. పిడుగులతో చిట్యాల మండలం రామకృష్ణాపురంలో పీటీఆర్ (పవర్ ట్రాన్స్‌ఫార్మర్) దెబ్బతినగా వెంటనే మార్చినట్లు చెప్పారు. ధన్వాడలో పీటీఆర్ సాంకేతిక లోపంతో దెబ్బతినడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా కాటారం, గంగారం సబ్ స్టేషన్ల నుంచి నాలుగు పీడర్ల ద్వారా కరెంట్ సరఫరాను వెంటనే పునరుద్ధరించామన్నారు. అప్రమత్తంగా ఉండి విలువైన పీటీఆర్ కాలిపోకుండా విధులు నిర్వర్తించిన కడారి ధనుష్‌ను అధికారులు అభినందించారు. కార్యక్రమంలో ఏడీఈ నాగరాజు, ఏఈ మేఘనాథ్, లైన్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కాంత్, ఎల్‌ఎం ప్రవీణ్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ భూమిలో ఖాకీ పాగా!

మైలారం గుట్ట వెనుక 4 ఎకరాల్లో పెన్సింగ్, దివ్యాంగుడి 30గుంటలు సైతం..

కబ్జాకు గురైన ప్రభుత్వ భూమి

గణపురం, సెప్టెంబర్ 3 : ప్రజలకు అండగా ఉండాల్సిన ఓ ఏఆర్ కానిస్టేబుల్ భూ కబ్జాదారుడిగా అవతారమెత్తాడు. మండలంలోని మై లారం గుట్ట వెనకాల ఉన్న ప్రభుత్వ భూమిని సుమారు 4 ఎకరాలతో పాటు పక్కన దివ్యాంగుడిని బెదిరించి పట్టా భూమి 30 గుంటలు కబ్జా చేశాడు. సదరు ఏఆర్ కానిస్టేబుల్‌పై బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్, తహసీల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడంతో కబ్జా బాగోతం వెలుగులోకి వచ్చింది. దివ్యాంగుడు దశరథ జనార్దనస్వామి కథనం ప్రకారం.. మైలారం గుట్ట వెనకాల సర్వే నంబర్ 117లో తనకు 7.18 ఎకరాలు ఉండగా ప్రభుత్వం పట్టా పాస్‌బుక్ ఇచ్చిందన్నారు. దానికి అనుకొని 205/1 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి వందల ఎకరాలు ఉండగా అందులో సుమారు 4 నుంచి 5 ఎకరాలను కానిస్టేబుల్ కబ్జా చేసి ఫెన్సింగ్ చేశాడన్నారు. అంతటితో ఆగకుండా తన పట్టా భూమిలో 30 గుంటలు ఆక్రమించుకొని హద్దులు ఏర్పాటు చేశాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇదేమిటని ప్రశ్నిస్తే తనను బెదిరిస్తున్నాడని చెప్పాడు. రెవెన్యూ సర్వే ఫీజు గవర్నమెంట్‌కు చెల్లించామని తద్వారా సర్వేయర్‌తో భూమిని కొలిపించి హద్దులు కూడా పెట్టుకున్నట్లు బాధితుడు తెలిపాడు. అయినప్పటికీ వినకుండా తమ హద్దుల రాళ్లను తీసివేసి ఇబ్బందులకు గురిచేస్తున్నాడని జనార్దనస్వామి చెప్పాడు. గతంలో పెద్ద మనుషుల సమక్షంలో కూడా పంచాయితీ చేసుకోగా వారు తీర్మానం చేశారని, అయినా వినకుండా నేను పోలీస్ అంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాడని ఆరోపించాడు. దీంతో చేసేది ఏమీ లేక స్థానిక పోలీస్‌స్టేషన్‌లో, తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. ఈ విషయమైన తహసీల్దార్ సత్యనారాయణ స్వామిని వివరణ కోరాగా బాధితుడి ఫిర్యాదుపై విచారణ చేపట్టి చర్యలు చేపడుతామన్నారు. ప్రభుత్వ భూమిని ఎవరైనా కబ్జా చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వంతెన నిర్మించాలని గ్రామస్తుల నిరసన

తాడ్వాయి, సెప్టెంబర్ 3 : జంపన్నవాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయని, వెంటనే వంతెన నిర్మించాలని ఎల్బాక, పడిగాపురం గ్రామాల ప్రజలు మంగళవారం వాగు వద్ద నిరసన తెలిపారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఆ యా గ్రామాలను మండల ప్రత్యేక అధికారి డాక్టర్ అల్లెం అప్పయ్య, తహసీల్దార్ రవీందర్, ఎస్సై శ్రీకాంత్ రెడ్డి సందర్శించి గ్రామస్తుల సమస్యలను తెలుసుకున్నారు. అప్పయ్య మాట్లాడుతూ గతంలో చింతల్ క్రాస్ వద్ద వంతెన మంజూరైందని గుర్తు చేశారు. కొంగలమడుగు ప్రాంతంలో రోడ్డుపై నిలిచిన నీటిని తొలగించి రాకపోకలను కొనసాగిస్తామని అన్నారు. త్వరలోనే గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీవో శ్రీధర్‌రావు ఉన్నారు.

కొండపర్తి బాధితులను ఆదుకోవాలి

- రూ.5లక్షల పరిహారం చెల్లించాలి
- మెడికల్ క్యాంపు నిర్వహించాలి
- జడ్పీ మాజీ చైర్ పర్సన్ నాగజ్యోతి

కొండపర్తి గ్రామంలో పర్యటిస్తున్న నాగజ్యోతి

తాడ్వాయి, సెప్టెంబర్ 3 : ఇటీవల కురిసిన గాలివానలకు ఇళ్లు కూలిపోయి, దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన కొండపర్తి గ్రామ గిరిజనులకు ప్రభుత్వం రూ.5లక్షల నష్టపరిహారంతోపాటు పక్కా ఇళ్లను నిర్మించి ఇవ్వాలని ములుగు జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్, నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి డిమాండ్ చేశారు. నాయకులతో కలిసి మంగళవారం కొండపర్తి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఇళ్లు కోల్పోయిన వారిని పరామర్శించారు. అనంతరం నాగజ్యోతి మాట్లాడుతూ వట్టివాగు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుని గిరిజనులు రెండు రోజులపాటు బిక్కుబిక్కుమంటూ గడిపారని, ప్రభుత్వం, అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మొదటగా వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి ఐదు లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించి వారికి పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరదల కారణంగా చనిపోయిన వారి కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాగజ్యోతి వెంట గ్రంథాలయ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, ఆత్మ మాజీ చైర్మన్ దుర్గం రమణయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, నాయకులు దిడ్డి మోహన్‌రావు, ఇంద్రారెడ్డి, రమేశ్, నాగక్క తదితరులున్నారు.

అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం

ఏటూరునాగారం : మండలంలోని శంకరాజుపల్లి గ్రామానికి చెందిన తీగల చంద్రయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా జడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్‌ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి మంగళవారం ఆయనను పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 5వేలు అందజేశారు. ఇదే గ్రామానికి చెందిన తాటిపల్లి సురేష్ బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతుండగా అతన్ని కూడా పరామర్శించి రూ.3వేలు అందజేశారు. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, మేడారం ట్రస్టుబోర్డు మాజీ డైరెక్టర్ సప్పిడి వెంకట్రాంనర్సయ్య జ్వరంతో బాధపడుతుండగా పరామర్శించారు. పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, నాయకులు తుమ్మ మల్లారెడ్డి, మాదిరి రామయ్య, ఈసం రామ్మూర్తి, దేవులపల్లి సమ్మయ్య, అల్లంల చంటి, చామర్తి మనోజ్, హరిశంకర్, రవి, తాటిపల్లి దేవేందర్ పాల్గొన్నారు.

శరవేగంగా సబ్ కలెక్టర్ కార్యాలయ పనులు

కాటారం, సెప్టెంబర్ 3: మండలకేంద్రంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో సబ్ కలెక్టర్ కార్యాలయం ఏర్పాటు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కార్యాలయం కోసం ఐదు గదులను కేటాయించగా పనులు నిరంతరం కొనసాగుతున్నాయి. త్వరలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్ విధుల్లో చేరనుండడం, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కార్యాలయాన్ని ప్రారంభించనుండడంతో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, ఐటీడీఏ ఇంజినీర్లు, పంచాయతీ కార్యదర్శి సఫీరాఖాన్ పనులను పర్యవేక్షిస్తున్నారు.

భూపాలపల్లి సీపీవోగా బాబూరావు

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 3 : జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సీపీవో)గా డీ బాబూరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సామ్యూల్ ఉప సంచాలకుడిగా పదోన్నతిపై యాదాద్రి భువనగిరి జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో నిర్మల్ జిల్లా సీపీవోగా పనిచేస్తున్న బాబురావు ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్‌శర్మను సీపీవో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

కాటారం ఏవోగా పూర్ణిమ

కాటారం, సెప్టెంబర్ 3 : మండల వ్యవసాయ అధికారిగా సౌళ్ల పూర్ణిమ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా పూర్ణిమ పెద్దపల్లి జిల్లా నుంచి కాటారం ఏవోగా బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన గిరి రామకృష్ణ పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలానికి బదిలీ అయ్యారు. ఏవోగా బాధ్యతలు స్వీకరించిన పూర్ణిమ ఏడీఏ శ్రీపాల్‌ను మర్యాదపూర్వకంగా కలువగా ఏఈవోలు రాజన్న, సరిత, దివ్యజ్యోతి, శరత్‌లు ఏవోను మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో

ములుగురూరల్, సెప్టెంబర్ 3 : సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని రాయినిగూడెం పీహెచ్‌సీని సందర్శించి ఫార్మసీలోని మందులను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్, వైద్య సిబ్బంది ఉన్నారు.

కేజీబీవీని తనిఖీ చేసిన జడ్పీ సీఈవో

మహాముత్తారం, సెప్టెంబర్ 3 : మండలంలోని కస్తూర్బా విద్యాలయాన్ని జడ్పీ సీఈవో విజయలక్ష్మి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏఏ తరగతుల్లో ఎంత మంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, డైనింగ్ హాల్, డార్మెటరీ, వాటర్ ప్లాంట్, రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి ఆమె భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏఈపీఆర్ రమేశ్‌బాబు, ఏపీవో కుమారస్వామి, స్కూల్ ప్రత్యేకాధికారి పుణ్యవతి తదితరులు ఉన్నారు.

'గ్రామ సమస్యలు పరిష్కరించాలి'

గోవిందరావుపేట, సెప్టెంబర్ 3 : మండలంలోని పస్రాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం జీపీ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ హుజుంకు కాంగ్రెస్ యూత్ నాయకులు వినతిపత్రం అందజేశారు. వర్షాల కారణంగా గ్రామంలో తీవ్ర పారిశుధ్య సమస్య నెలకొందని వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. యూత్ కాంగ్రెస్ కార్యదర్శి గొంది కిరణ్, జక్కు రణదీప్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి జీవాలకు వ్యాధి నివారణ టీకాలు

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 3: జిల్లాలో సెప్టెంబర్ 4 నుంచి 18 వరకు గొర్రెలు, మేకలకు పీపీఆర్ వంటి వ్యాధులు సోకకుండా టీకాలు వేయనున్నట్లు జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి గోపాలకృష్ణ మంగళవారం తెలిపారు. పీపీఆర్ అనేది వైరస్ వల్ల కలిగే వ్యాధన్నారు. మూడు నెలలు దాటిన జీవాలకు తప్పనిసరిగా టీకాలు వేయిస్తే ఈ వ్యాధి రాకుండా మూడేళ్ల వరకు పనిచేస్తుందన్నారు.

నాయబ్ తహసీల్దార్లకు పదోన్నతి

భూపాలపల్లి రూరల్, సెప్టెంబర్ 3: మల్టీజోన్-1లో పనిచేస్తున్న నాయబ్ తహసీల్దార్లకు తహసీల్దార్‌గా పదోన్నతి కల్పిస్తూ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ నవీన్‌మిట్టల్ మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో నాయబ్ తహసీల్దార్లుగా పనిచేస్తున్న సీహెచ్ సురేందర్‌ను ఖమ్మం, బీ బాలకృష్ణను మహబూబాబాద్, ఎం వేణుగోపాల్‌ను ములుగు జిల్లాకు, ములుగు జిల్లాలో నాయబ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సయ్యద్ సర్వర్‌ను జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు తహసీల్దార్‌గా బదిలీ చేశారు.

నెడితే కానీ స్టార్ట్ కాదు..!



అంబులెన్స్‌ను వెనుక నుంచి నెడుతున్న స్థానికులు

ఏటూరునాగారం, సెప్టెంబర్ 3 : మండల కేంద్రంలోని సామాజిక వైద్యశాల వద్ద ఒక రోగిని వైద్యుల సిఫారసు మేరకు ఎంజీఎంకు తరలించేందుకు అంబులెన్స్‌లో ఎక్కించారు. అంబులెన్స్‌కు స్టార్టింగ్ సమస్య రావడంతో నెట్టాల్సిన అవసరం ఏర్పడింది. స్థానికులు అంబులెన్స్‌ను నెట్టడంతో స్టార్ట్ అయ్యింది. దీంతో రోగిని ఎంజీఎంకు తరలించారు. మార్గమధ్యలో ఆగిపోతే ఎలా..? అని పలువురు ప్రశ్నించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

PLOTS FOR SALE

★హన్మకొండ KITS కాలేజీ, అంబాల రోడ్డుకు మరియు ముచ్చర్ల రోడ్డుకు కొత్తగా వస్తున్న హైవేకు దగ్గర్లో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మకానికి కలదు. సంప్ర: సెల్: 9553255936
NTW-326316

BUSINESS OFFER



★చాలా పెద్ద చదువులు చదువుకున్న నిరుద్యోగ యువతీ, యువకులకు సువర్ణావకాశం. అతి తక్కువ పెట్టుబడితో ప్రతి నెల అత్యధికంగా సంపాదించుకునే సువర్ణావకాశం. సంప్ర: సెల్: 9502940056.
NTW-326315

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565